క్లుప్తంగా

అధ్యాపకుడికి డాక్టరేట్



దశరథరామిరెడ్డిని అభినందిస్తున్న ఎన్‌బీకేఆర్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.దశరథరామిరెడ్డికి వేలూరు యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ అనాలసిస్ ఆఫ్ ఫెడరేటిడ్ లెర్నింగ్ అనే అంశంపై చేసిన పరిశోధనకు వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దశరథరామిరెడ్డిని కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, హెచ్‌ఓడీ రాజశేఖర్‌రెడ్డి అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఆరూరు విద్యార్థి



పోటీలకు ఎంపికైన విద్యార్థితో పీఈటీ సురేష్

చిట్టమూరు(చిల్లకూరు): ఆరూరు గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అండర్–14 విభాగంలో రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం జ్యోతి మంగళవారం తెలిపారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా జిల్లా స్థాయిలో జరిగిన అండర్–14 విభాగంలో వాలీబాల్‌లో మంచి ప్రతిభ కనబరచడంతో పాఠశాలలో 9వ తరగతి చదివే నిఖిల్‌సాయి అనే విద్యార్థి త్వరలో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ మేరకు విద్యార్థికి సహకరించిన పీఈటీ సురేష్, ఉపాధ్యాయుడు చలపతిని అభినందించారు.

రాయితీ పథకాలపై అవగాహన

కలువాయి: రైతులకు ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న పథకాలపై వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. కలువాయి మండలం చీపినాపి, తోపుగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు అవసరమైన వ్యవసాయ సలహాలు, సూచనలు అందజేశారు. గ్రామాల్లో సాగులో ఉన్న అలసందలు, కంది, మినుము పైర్లకు ఆశించే తెగుళ్లు, పురుగులు వాటి నివారణపై రైతులను చైతన్యవంతం చేశారు. కార్యక్రమంలో ఏడీఏ శివనాయక్, ఏఓ వి.ప్రతాప్, ఏఈఓలు చంద్రశ్రీ, రామకృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



పునబాక గ్రామంలో పారిశుధ్య పనులు

పెళ్లకూరు: మండలంలోని అర్ధమాల, పునబాక, పాలచ్చూరు, దిరసనమాల గ్రామాల్లో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి మధుమోహన్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన వీధుల్లో చెత్తాచెదారాలు తొలగించి శుభ్రం చేయించారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన మురుగు నిల్వలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. నివాసాల మధ్య, తాగునీటి కుళాయిల వద్ద చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి



కొండాగుంటలో పొలం పిలుస్తోంది

గూడూరు రూరల్: రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా ఆలోచన చేయాలని రైతులకు వ్యవసాయశాఖ ఏడీఏ గోపినాయక్ సూచించారు. మండలంలోని కొండాగుంట, నెర్నూరు గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సార పరీక్షలు చేయించుకోవాలని, ఈ క్రాప్ నమోదు చేయించుకుంటే సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. పశుసంవర్ధక శాఖ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పలు సూచనలు అందించారు. వ్యవసాయాధికారులు రమేష్, కార్తీక్, డాక్టర్ సుదర్శన్ పాల్గొన్నారు.

కండలేరులో 37.987 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 37.987 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు వరద కాలువ నుంచి 100 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతోందన్నారు. అలాగే సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 9500 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. సత్యసాయిగంగ కాలువకు 140, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 10 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శిథిలస్థితిలో ప్రభుత్వ భవనాలు

- జీటలు వారిన గోడలు
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహణ
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం

ఓజిలి: మండల కేంద్రమైన ఓజిలిలో పలు ప్రభుత్వ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ కార్యాలయాల్లో పనిచేయాలంటేనే హడలిపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. 1986వ సంవత్సరంలో అప్పటి రెవెన్యూ మంత్రి నల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి హయాంలో తహసీల్దార్ కార్యాలయ నిర్మాణానికి పూనుకున్నారు. గత 38 ఏళ్ల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కార్యాలయంలోని గదుల పైశ్లాబు పెచ్చులూడి పడుతున్నాయి. ఈ గదుల్లో వర్షాకాలం వచ్చిందంటే పలు రికార్డులు కూడా తడిచిపోతున్నాయి. గతేడాది ఓ ఆర్‌ఐపై శ్లాబు పెచ్చులూడి పడడంతో గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ప్రస్తుతం తహసీల్దార్ గదిలో శ్లాబు పూర్తిగా పెచ్చులూడి కిందపడిపోయింది. ఈ క్రమంలో తహసీల్దార్ బదిలీపై వెళ్లడంతో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అలాగే డీటీ, సర్వేయర్లు, వీఆర్‌ఓలు విధులు నిర్వహించే గదులు అధ్వాన్నంగా ఉన్నాయి. బీసీ బాలుర వసతిగృహం కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. శ్లాబు పెచ్చులు ఉడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అలాగే వ్యవసాయశాఖ కార్యాలయం, ఓజిలి పోలీస్ స్టేషన్, పోలీస్ క్వార్టర్స్ తదితర భవనాలు కూడా శిథిలస్థితికి చేరుకున్నాయి. సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. పోలీస్ క్వార్టర్స్ భవనాల్లో 30 గదులు చెత్తాచెదారాలతో నిండిపోయి నిరుపయోగంగా మారాయి. చిలమానుచేను గ్రామంలో నూతనంగా నిర్మించిన వసతిగృహం గోడలు బీటలువారాయి. పున్నేపల్లి గ్రామంలో పంచాయతీ భవనం కూలేందుకు సిద్ధంగా మారింది. వీటిపై అధికారులు దృష్టి సారించి నూతన భవనాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



ఆర్‌ఐలు విధులు నిర్వహించే గదిలో బీటలు వారిన గోడలు



తహసీల్దార్ గదిలో పెచ్చులూడిన శ్లాబ్(ఫైల్)



శిథిలావస్థకు చేరిన వ్యవసాయశాఖ కార్యాలయం

పంటల సాగులో మెళకువలు పాటించాలి



మాట్లాడుతున్న ఏడీఏ నాగార్జున సాగర్

వెంకటగిరి రూరల్: పంటల సాగు విషయంలో మెళకువలను పాటించాలని వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జునసాగర్ పేర్కొన్నారు. మండలంలోని చింతగుంట, గుండ్లసముద్రం గ్రామంలో వ్యవసాయ, అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేయాల్సిన వరిపంట రకాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రాస్ శాస్త్రవేత్త డాక్టర్ ప్రతిమ, మోహన్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల ఆధారంగా తగు పంటలను సాగు చేయాలని సూచించారు. నిమ్మ, చీని పరిశోధన స్థానం శాస్త్ర వేత్త డాక్టర్ బీకే నాయక్ మాట్లాడుతూ నిమ్మలో రకాలు సాగు పద్ధతులు, చీడపీడల నివారణపై రైతులకు సమగ్రంగా వివరించారు. కేవీకే శాస్త్రవేత్త రాజీవన మాట్లాడుతూ పెరటి తోటల సాగుపై రై తులు భూ సారాన్ని పరీక్షలు చేయించుకోవాలన్నా రు. ఏఓ సుజాత, పశువైద్యాధికారి కిషోర్, విస్తరణ అధికారి రామ్మోహన్, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సైదాపురం: నిమ్మ తోటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఆత్మ పీడీ శివనారాయణ కోరారు. మండలంలోని మర్లపూడి, లింగసపాళెం రైతు భరోసా కేంద్రాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. లింగసపాళెం గ్రామంలో నిమ్మ రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సమగ్రంగా వివరించారు. ఎలాంటి చీడపీడలు సోకినా తమ దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, ఏఓ హైమావతి తదితరులున్నారు.

కోటలో..

కోట: రబీ సాగులో రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులను అవలంబించాలని ఏఓ నిరంజన్ కుమార్ సూచించారు. మండలంలోని అల్లంపాడు, పుచ్చలపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ నాణ్యమైన వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలన్నారు. పంటకు అవసరమయ్యే స్థూల, సూక్ష్మ పోషకాలను వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం పాడి రైతులకు అందిస్తున్న పథకాలు, సీజనల్ వ్యాధులను ఎదుర్కోవడంపై పశుసంవర్ధక శాఖ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఓలు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సూళ్లూరుపేట రూరల్: ఎస్‌ఐ బ్రహ్మానాయుడు సీనియర్ న్యాయవాది అయిన ధర్మాప్రసాద్‌ను అవమానించి, అనుచితంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తూ న్యాయవాదులంతా మంగళవారం కోర్టు విధులను బహిష్కరించి, నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయవాద వృత్తిని అవమానించేలా వ్యవహరించిన ఎస్‌ఐను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఐ బ్రహ్మానాయుడుకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం నాయుడుపేట న్యాయవాదులతో కలిసి డీఎస్పీకి ఎస్‌ఐ తీరుపై వినతిపత్రం అందజేశారు. జిల్లా ఎస్పీకి కూడా వినతిపత్రం సమర్పించారు. ఎస్‌ఐ పని తీరుపై విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్పీ చెప్పారని న్యాయవాదులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట ఎస్‌ఐ బ్రహ్మానాయుడు అక్కడి న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన తీరుపై నాయుడుపేటలో న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు. మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పసల గంగాప్రసాద్ సారథ్యంలో న్యాయవాదులు విరామ సమయంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వెందోటి పార్థసారధిరెడ్డి, న్యాయవాదులు చదలవాడ కుమార్, ఆశా చెంచుకృష్ణయ్య, వీరాస్వామి, రఫీ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాలను గుర్తించండి

చిల్లకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న గిరిజన కుటుంబాలను గుర్తించి, వారి వివరాలను సేకరించాలని ఎంపీడీఓ గోపి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన అన్ని సచివాలయాల్లో పని చేసే వెల్ఫేర్, మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు అందించాలని తెలిపారు. అయితే మండలంలో ఉన్న గిరిజన కుటుంబాల్లోని వారికి ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందివ్వలేక పోతున్నామని తెలిపారు. వారు జనాభా లెక్కలో కూడా లేకుండా పోతున్నారని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరికి ఆధార్ అందించేలా వారిని గుర్తించి జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ నెలఖారులోగా ఈ పని పూర్తి చేయాలని తెలిపారు.

ఉచిత పశువైద్య శిబిరాలను వినియోగించుకోండి



జీవాలకు డీవార్మింగ్ మందు తాగిస్తున్న అధికారులు

కలువాయి: గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను ప్రజలు, పశు పెంపకందారులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ డీడీ నాగమణి, ఏడీ అన్నపూర్ణ కోరారు. రాష్ట్రీయ గోకుల మిషన్ ఆధ్వర్యంలో కలువాయిలో మంగళవారం గర్భకోశ వ్యాధులపై ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేసినా చూలుకు రాకపోవడం, అందుకు గల కారణాలను రైతులకు వివరించారు. పశువులకు సంక్రమించే వ్యాధులు, వాటి నివారణకు వాడే టీకాలపై అవగాహన కల్పించారు. తొలకరి వర్షాలు పడుతున్నందున సాధారణంగా పశువుల్లో వచ్చే వ్యాధుల నివారణకు శిబిరాల్లో టీకాలు వేస్తున్నట్లు వివరించారు. మండలంలో మంగళవారం నాటి శిబిరంలో 90 గేదెలు, 2000 గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో కోవూరు డీఎల్‌డీఏ శ్రీనివాసరావు, కలువాయి, చేజర్ల మండలాల పశువైద్యులు, వారి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో వృద్ధులకు చేయూత

నాయుడుపేట టౌన్: మండల పరిషత్ కార్యాలయం సమీపంలో ఉన్న మేరీ వృద్ధాశ్రమానికి దాతలు చేయూత అందిస్తున్నారు. పట్టణానికి చెందిన నాయకులు ఆకుల కుబేరు మణి, మల్లికార్జునరెడ్డి మంగళవారం ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందించి, అన్నదానం చేపట్టారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వృద్ధులు తమ వంతుగా చేయూత అందించినట్లు తెలిపారు. వి.శ్రాంత వార్డెన్ వెంకటయ్య, అంకయ్య, షేక్ అల్లా బాషా, డాక్టర్ అంకయ్య ఆశ్రమ నిర్వాహకులు బెన్నీ పాల్గొన్నారు.

యజమాని వేధింపులతోనే గిరిజనుడి ఆత్మహత్య



బాధిత కుటుంబంతో యానాదుల సంక్షేమ నాయకులు

గూడూరు రూరల్: చిట్టమూరు మండలం కోగిలిలోని ఓ రొయ్యల గుంత వద్ద కాపలా ఉన్న గిరిజనుడు యజమాని వేధింపులతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. రెండు రోజుల క్రితం కోగిలిలోని రొయ్యల గుంత వద్ద ఆత్మహత్యకు పాల్పడిన గిరిజనుడు తుపాకుల చెంచుక్రిష్ణయ్య కుటుంబాన్ని గూడూరులోని నరసింగారావుపేట వద్ద మంగళవారం యానాదుల సంక్షేమ సంఘం బృంద సభ్యులు పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ కోగిలిలోని రొయ్యల గుంత యజమాని రెహమాన్ వేధింపులు తట్టుకోలేకనే చెంచుక్రిష్ణయ్య ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య స్పష్టంగా చెబుతోందన్నారు. దీనిని పరిగణనలోకి తీసుకోకుండా గుట్టుచప్పుడు కాకుండా మృత దేహాన్ని గూడూరుకు తరలించి పూడ్చి పెట్టడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పూర్తి స్థాయి విచారణ చేసి గిరిజన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యానాదుల నాయకులు తలపల చెంచుమల్లికార్జున, మానికల మురళీ, చెంబేటి ఉషా, ఇండ్ల మల్లి ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు దళితవాడకు చెందిన మెరుం గీత అనే వివాహితను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కులం పేరుతో దూషించి, దాడి చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు గ్రామానికి చేరుకుని పూర్తి స్థాయిలో విచారించారు. ఈ మేరకు నిందితుడిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా ఘటోత్సవం



పురవీధుల్లో ఘటోత్సవం

సైదాపురం: మండల కేంద్రమైన సైదాపురంలో ఆదివారం ప్రారంభమైన ఘటోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఈ సందర్భంగా పురవీధుల్లో ప్రతి ఇంటికి వెళ్లిన ఘటానికి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ మంతా విద్యుత్ దీపాలంకరణ చేశారు. మంగళవారం రాత్రి నుంచి కోలాహలంగా జాతర సందడి ప్రారంభమైంది. పుట్టినిల్లయిన కుమ్మరి వారింటి నుంచి పోలేరమ్మ తల్లిని అత్తగారింటికి ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. అక్కడ నుంచి గ్రామ నడిబొడ్డులో ఏర్పాటు చేసిన మండపంలో అమ్మవారిని నిలుపు చేశారు. ఈ సందర్భంగా గ్రామ వీధుల్లో విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

హద్దుల్లో తేడాలు ఉంటే సరిచేస్తాం



గూడూరు రూరల్‌లో గ్రామసభలో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

గూడూరు రూరల్: రీ సర్వే సమయంలో ఏవైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సరి చేసేందుకు మరోసారి సర్వే చేపడుతున్నామని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ప్రసాద్ తెలిపారు. మండలంలోని కొమ్మనేటూరు గ్రామంలో రీ సర్వేపై వచ్చిన సమస్యలను పరిష్కరించేలా గ్రామ సభ నిర్వహించారు. మంగళవారం గ్రామ సభలో పలువురు రైతులు తమ అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్పులు, చేర్పులు, హద్దుల్లో తేడాల సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సుబ్బరాయుడు , మండల సర్వేయర్ విశ్వనాథం, గ్రామ సర్వేయర్ ప్రశాంత్ పాల్గొన్నారు.

చిల్లకూరులో...

మండలంలోని ఇప్పనూడి రెవెన్యూ పరిధిలోని పల్లమాల గ్రామంలో రీ సర్వేపై గ్రామ సభను రెవెన్యూ అధికారులు నిర్వహించారు. భూములకు సంబంధించి సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపడుతామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి



సైదాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

సైదాపురం: పేదల భూములు అక్రమించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సైదాపురం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ ఇ.రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సాగు చేసే భూములకు కంచెను ఏర్పాటు చేస్తే భూస్వామి ఆ కంచెను తగలబెట్టారని ఆయన ఆరోపించారు. జోగిపల్లి గ్రామంలో 8ఎకరాల భూమికి ప్రభుత్వం పేదలకు పట్టాలను మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుంచి భూఆక్రమణలతో పాటు పేదలపై దాడులు కొనసాగుతున్నాయన్నారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఆయన అధికారులను కోరారు. కార్యక్రమంలో నేతలు కె.రమేష్, కె.చెంగల్‌రావు, ఎం.కృష్ణయ్య, ఎం.అంకయ్య, పి.వెంకటయ్య, డి.శ్రీనివాసులు తదితరులున్నారు.

నిధులు సమకూర్చుకోవాలి



దక్కిలి: మాట్లాడుతున్న రిసోర్సు పర్సన్ రవి

దక్కిలి: గ్రామ పంచాయతీల్లో స్థానికంగానే నిధులు సమకూర్చుకోవాలని జిల్లా రిసోర్సుపర్సన్ వి.రవి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ అధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పీఆర్ యాప్–1 ద్వారా శానిటేషన్, క్లోరినేషన్ తదితర మౌలిక వసతులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఈ కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా నిధులను స్థానికంగానే సమకూర్చుకునేందుకు తగు ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని తెలిపారు. గ్రామాల్లో ఉన్న చెరువుల వేలం పాటలు సకాలంలో నిర్వహించి, పంచాయతీల ఆదాయ మార్గాలను పెంపొందించాలని వివరించారు. 15శాతం నిధులతో శాశ్వతంగా ఉండేలా పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కార్యదర్శులు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో కలిసి విధి నిర్వహణ, పంచాయతీ పాలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డీఎల్‌పీఓ వెంకటరమణ, ఈఓపీఆర్డీ అల్లాబక్షు పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల కోసం ఆందోళన



విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయం వద్ద ఆందోళన

నాయుడుపేట టౌన్: విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరుతూ పట్టణంలోని పాగగొట్టం కాలనీవాసులు మంగళవారం విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. బాధితులు విలేకరులతో మాట్లాడుతూ పాగొట్ట ం కాలనీలో ఎన్నో ఏళ్ల కిందట స్థలాలు కొనుగోలు చేసి, ఇళ్లు నిర్మించుకున్నామన్నారు. విద్యుత్ మీటర్లకు నగదు చెల్లించి దరఖాస్తులు చేసుకున్నా మంజూరు చేయడం లేదన్నారు. విద్యుత్ మీటర్లు మంజూరు చేయకుండా అధికారులు బడాబాబులకు కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కాలనీ వాసులు విద్యుత్ కార్యాలయం వద్ద బైఠాయించి ఆందోళన చేస్తుండడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ శ్రీహరిబాబు పోలీసులతో విద్యుత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. కాలనీ వాసులు విద్యుత్ మీటర్లు మంజూరు చేయాలని కోరుతూ ఏఈ వెంకటస్వామిని కలిసి వినతి పత్రాన్ని అందించారు. అదే విధంగా ఈఈను సైతం కలిసి సమస్యను వివరించారు.

నిబంధనలు మీరి నిర్మాణాలు



చెరువు కింద భవన నిర్మాణ పనులు

చిల్లకూరు: గూడూరు పెద్ద చెరువు కింద భవనాల నిర్మాణంలో నిబంధనలు పాటించడం లేదు. దీనిపై చెరువు కింద ఆయకట్టు రైతులు మంగళవారం నీటిపారుదల శాఖాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ భవన నిర్మాణం 2017 చట్ట ప్రకారం చెరువు కట్ట నుంచి పది మీటర్ల వరకు ఎలాంటి కట్టడాలు నిర్మించకూడదని తెలిపారు. అయితే గూడూరు పెద్ద చెరువు కింద ఉన్న భూములు కొనుగోలు చేసినవారు తమ ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతన్నారని ఆరోపించారు. లోతుగా తవ్వి మట్టి తరలిస్తున్నారని, దీని వల్ల భవిష్యత్తులో కట్ట మరమ్మతులు చేసుకునే సమయంలో ఇబ్బంది తప్పదని తెలిపారు. అధికారులు స్పందించాలని కోరారు. ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించిన అనంతరం ఏఈ సురేష్ మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకుని భవనాలు నిర్మిస్తున్నారని, పత్రాలను చూపించారని వీటిని ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు.

తాత్కాలిక లైసెన్స్‌తో మద్యం దుకాణం

చిల్లకూరు: గూడూరు పట్టణ నడి బొడ్డున గాంధీ మున్సిపల్ బిల్డింగ్ ఏర్పాటు చేయడంపై మంగళవారం సాక్షి దినపత్రికలో వచ్చిన 'మహాత్మా మన్నించు' అనే కథనంపై ఎక్సైజ్ అధికారులు స్పందించారు. మంగళవారం దీనిపై వివరణ ఇచ్చారు. గూడూరు ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ కరీమా బేగం మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా ప్రైవేటు మద్యం షాపులు ఏర్పాటు చేసే క్రమంలో టవర్ క్లాక్ ప్రాంతంలోని గాంధీ మున్సిపల్ బిల్డింగ్‌లో తాత్కాలిక లైసెన్స్ మంజూరు చేశామని తెలిపారు. త్వరలో రెండు సంవత్సరాల లైసెన్స్ జారీ చేసే క్రమంలో అన్ని విధాలుగా పరిశీలిస్తామని తెలిపారు.